సాక్షి
ప్రకాశం
సోమవారం । 28 । ఆగస్టు । 2023





### త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఆనుకుని ఉన్న ఎస్ఆర్ క్వార్టర్స్‌కు మంటలు అంటుకుని అగ్నిప్రమాదం సంభవించింది. మెడికల్ సామగ్రి దగ్ధమైంది.

- 8లో..



### ఓనం స్పెషల్..ఉలవపాడు పునారస్

కేరళలో జరిగే ఓనం పండుగ సందర్భంగా ఉలవపాడు పునారస్ మామిడి కాయలకు మంచి గిరాకీ ఏర్పడింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37/28

### వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లు వాయిదా

**ఒంగోలు:** ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించతలపెట్టిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయం నుంచి అందిన సమాచారం మేరకు సమావేశాలను ఈనెల 30, 31 తేదీల్లో వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్పును గమనించి సమావేశాలకు సంబంధించి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు సమావేశాలకు హాజరుకావాలన్నారు.

### క్రీడాప్రతిభా అవార్డులకు ఐదు పాఠశాలల ఎంపిక

**ఒంగోలు:** క్రీడాప్రతిభా అవార్డులకు జిల్లాలో ఐదు పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ప్రతి జిల్లా నుంచి ఎంపిక చేసిన ఐదు పాఠశాలల జాబితాను ప్రకటించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రథమ స్థానంలో సంతనూతలపాడు ఎస్ఎస్‌సీకేఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట కేజీబీవీ పాఠశాల, మూడో స్థానంలో జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాలుగో స్థానంలో కనిగిరి మండలం గురవాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఐదో స్థానంలో కనిగిరి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలను ప్రకటించారు. ఈ పాఠశాలలకు హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని డీఈవో చేతులమీదుగా మెమెంటో, ప్రశంసపత్రాన్ని అందిస్తారు. దీంతోపాటు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా వివిధ ఆటల పోటీలను నిర్వహించనున్నారు.

### పోస్టల్ ఉద్యోగుల 3కె రన్



3కె రన్ ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు

**మార్కాపురం:** ఈనెల 21 నుంచి 29 వరకూ జరుగుతున్న నేషనల్ స్పోర్ట్స్ ఉత్సవాల సందర్భంగా ఆదివారం తపాలా సిబ్బంది 3కె రన్‌ను మార్కాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కే శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం వలన శారీరక, మానసిక వికాసం కలుగుతుందని, ఒత్తిడిని అధిగమించవచ్చని అన్నారు. 3కె రన్‌తోపాటు 5కె వాక్ కూడా ఉద్యోగులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, పోస్ట్ మాస్టర్ సయ్యద్ సుభానీ పాల్గొన్నారు.

# సాగుకు సాయం

భూసారం.. విత్తనాల్లో మొలక శాతం.. ఎరువుల నాణ్యత ఎంతెంత ఉన్నాయో తెలుసుకునేందుకు గతంలో రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. అంతేగాక రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారా లేదా అనేది నిర్ధారణ ముందుగా జరిగేది కాదు. పంట వేసి నష్టపోయిన తర్వాత తెలుసుకుని నష్టపోయామని లబోదిబోమనే వారు. ఇటువంటి వాటికి చెక్‌పెడుతూ సమగ్ర వ్యవసాయ పరీక్షలను రైతుల చెంతకు చేర్చింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రతి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు నిర్మించింది. ఇప్పటికే కనిగిరి, సింగరాయకొండల్లో ఈ కేంద్రాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చి రైతులకెంతో ఉపయుక్తంగా ఉన్నాయి.



కనిగిరిలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్ భవనం

- రైతులకు మేలు చేస్తున్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు
- నాణ్యమైన, మేలు రకం విత్తనాలు, ఎరువుల కోసం తక్షణ పరీక్షలు
- సమగ్ర వ్యవసాయంలో మరింత నాణ్యత

**కనిగిరి రూరల్:** రైతులు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలి. అందుకోసం నాణ్యతా ప్రమాణాలతో కూడిన, మేలురకం విత్తనాలు, ఎరువులను రైతులు వాడాలి. వాటిని పరిపూర్ణంగా అందించాలనే ఉన్నత లక్ష్యంతో, రైతుల లక్ష్య సాధనకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈమేరకు ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గంలోని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సుమారు రూ.55 లక్షలతో భవన నిర్మాణాలు, కావాల్సిన పరీక్ష సామగ్రితో ప్రయోగశాలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**ప్రతి నియోజకవర్గంలో..**

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు అన్ని చోట్ల భవన నిర్మాణాలు పూర్తికాగా, మార్కాపురంలో చివరి దశలో పనులు ఉన్నాయని



అగ్రి ల్యాబ్‌లో పరీక్షిస్తున్న సిబ్బంది

అధికారులు తెలిపారు. కనిగిరి, సింగరాయకొండలో పూర్తి స్థాయిలో అగ్రి ల్యాబ్‌లో వినియోగంలోకి వచ్చాయి. మిగతా చోట్ల కూడా నెలాఖరులోగా సమగ్రంగా రైతులకు సేవలు అందించనున్నారు.

**కనిగిరి నియోజకవర్గంలో..**

స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.55 లక్షలతో అధునాతన పరికరాలతో ప్రయోగశాల, పరికరాలు ఏర్పాటు చేశారు. 2021 జులైలో 8న ప్రారంభించినా, 2022 నుంచి సంపూర్ణంగా వినియోగంలోకి వచ్చింది. ఆరు మండలాలకు చెందిన 96 రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) పరిధిలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. రైతులు సాగు చేసే పంటల విత్తనాల నాణ్యతను పరీక్షించడమే కాకుండా రీజినల్ కార్యాలయం నుంచి వచ్చే విత్తనాలను కూడా పరీక్షిస్తారు.

**నాణ్యత పరీక్షలు ఇలా..**

ఈ ప్రయోగశాలల్లో మినుము, కంది, వరి, పెసర, పిల్లి పెసర, జనుము, మొక్కజొన్న, మిరప, రాగులు, సజ్జలు, తదితర పంటలతో పాటు కూరగాయల విత్తనాల నాణ్యతను కూడా పరీక్షించవచ్చు. పరీక్షించే విత్తనాలను నాలుగు రకాలుగా విభజిస్తారు. ఏసీటీ నమూనాలుగా రీజినల్ కార్యాలయాల నుంచి వచ్చే నమూనాలను ప్రత్యేకంగా కోడింగ్ ఇచ్చి పరీక్షిస్తారు. ఆర్‌బీకే ద్వారా వచ్చిన నమూనాలను ట్రేడ్ శాంపిల్స్‌గా విభజించి పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో ట్రేడ్ శాంపిల్స్ పరీక్షలకు మాత్రమే షాపుల వారు మినిమం ధరలు చెల్లించాల్సి ఉంటుంది.

**సింగరాయకొండ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఇలా..**

సింగరాయకొండలో ఎరువులు, విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్నారు. షాపుల్లో విక్రయించే విత్తనాలు, ఎరువుల నాణ్యతా తనిఖీల్లో తీసుకున్న 250 విత్తనాల శాంపిల్స్ ఇప్పటి వరకు పరీక్షించారు. దీంతో పాటు సింగరాయకొండ సబ్‌డివిజన్ పరిధిలోని ఆర్బీకేల నుంచి వచ్చే శాంపిళ్లను కూడా పరీక్షిస్తున్నారు. ఇప్పటి వరకు 60 విత్తనాల శాంపిళ్లను పరీక్షించారు. విత్తన మొలకశాతాన్ని పరిశీలిస్తారు. ఎరువులు 150 శాంపిల్స్ పరిశీలించారు. ఇంకో 20 శాంపిల్స్ చేయాల్సి ఉంది.

**కనిగిరిలో ఇప్పటి వరకు జరిగిన శాంపిల్స్ వివరాలు..**

| సంవత్సరం | ఏసీటీ శాంపిల్స్ | |
|---|---|---|
| | ఎరువులు | విత్తనాలు |
| 2021-22 | 21 | 41 |
| 2022-23 | 74 | 97 |
| 2023-24 | 78 | 20 |
| | ఫార్మల్ శాంపిల్స్ | |
| 2023-24 | 101 | 3 |
| | ఆర్బీకే శాంపిల్స్ | |
| 2023-24 | 0 | 3 |
| | ట్రేడ్ శాంపిల్స్ | |
| | 190 | 26 |

**రైతులకు ఎంతో ఉపయోగం**



నియోజకవర్గంలో ఏర్పాటు చేసి వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వలన రైతులకు ఎంతో మేలు. గతంలో జిల్లా కేంద్రాలకు, ఇతర ప్రాంతాలకు ఎరువులు, విత్తనాల నాణ్యతా ప్రమాణాల పరీక్షలకు రైతులు వెళ్లాల్సి వచ్చేది. వ్యయం, సమయం వృథా అయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అగ్రి ల్యాబ్‌ను త్వరగా వినియోగంలోకి తెప్పించి కనిగిరి ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూర్చిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– సంగు సుబ్బారెడ్డి, కనిగిరి సహకార సొసైటీ చైర్మన్

**అధునాతన పరికరాలతో..**



అధునాతన పరికరాలతో కచ్చితమైన ఫలితాలు పొందేలా ప్రయోగశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి రైతు దీనిని సద్వినియోగం చేసుకోవచ్చు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకోవచ్చు. దీని వలన మంచి విత్తనాలు నాటి మెరుగైన పంట దిగుబడులు సాధించుకోవచ్చు. రైతులకు ఎంతో ప్రయోజనకరం.

– ఏడీఏ ఈ.వెంకట రమణ

## వడ్డెర జాతి సంక్షేమం

# వైఎస్ కుటుంబంతోనే

- వందలామందికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించింది వైఎస్ జగన్ మాత్రమే
- విద్యతోనే జాతి అభివృద్ధి
- ఎస్టీల జాబితాలో చేర్చాలనే అంశంపై ఇప్పటికే సీఎంకు విన్నవించాం
- ఎంఎల్‌సీ చంద్రగిరి ఏసురత్నం

**ఒంగోలు:** వడ్డెర జాతి సంక్షేమం, అభివృద్ధి వైఎస్ కుటుంబంతోనే అని శాసనమండలి సభ్యుడు చంద్రగిరి ఏసురత్నం అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన వడ్డెర, వడియ రాజుల బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరలను రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం వివాదాలకు మారుపేరుగా మార్చాయన్నారు. దీనివల్ల వివాదాల్లో చిక్కుకుంటే కేసులలో తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో వడ్డెర సంఘం ప్రతినిధి అంజన్‌రాజుకు ఎమ్మెల్యేగా పోటీచేసేందుకు అవకాశం కల్పించినా మనం గెలిపించుకోలేకపోయామన్నారు. అయినా ఆయనకు హస్తకళల ఫెడరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారని చెప్పారు. 2009లో మళ్లీ డాక్టర్ వెంకటరమణకు అవకాశం ఇచ్చినా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఆయన విదేశాలకు వెళ్లారని చెప్పారు. 2019లో తనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు నుంచి అవకాశం కల్పిస్తే తాను ఓటమి పాలయ్యానని, అయితే తనకు ఎన్నడూ లేని విధంగా మూడున్నర సంవత్సరాలపాటు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. మళ్లీ పిలిచి ఎమ్మెల్సీ అవకాశం కల్పించారంటే, వైఎస్సార్‌సీపీని నమ్ముకుని ఉద్యోగానికి రిజైన్ చేశానన్న ఒకే ఒక్క అంశంతో ఆయన తనకు అవకాశాలు కల్పించారన్నారు. తనకే కాదని ఎంతో మందికి కార్పొరేషన్ చైర్మన్‌లుగా, డైరెక్టర్లుగా, మున్సిపల్, జిల్లా ప్రజా పరిషత్ వంటి అనేక పదవులను కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. దాదాపు వందలాది పోస్టుల్లో నామినేటెడ్ పదవులు పొంది రాజకీయంగా ఎదిగేందుకు ఒక మంచి అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. మనమంతా ఐక్యంగా ఉండి 2024లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడంతో పాటు సామాజికవర్గ సంక్షేమం, అభివృద్ధిని బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు, శ్రీశైలం ట్రస్టుబోర్డు డైరెక్టర్ తన్నీరు ధర్మరాజు మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా అయ్యాక కోఆపరేటివ్/ లేబర్ కాంట్రాక్టు సొసైటీలకు మైనింగ్ పనుల్లో 20 శాతం, రోడ్ కాంట్రాక్టులలో ఈఎండీ లేకుండా అవకాశం కల్పించారన్నారు. కానీ చంద్రబాబు సీఎం అయ్యాక వాటిని తొలగించారని ఇదేనా సంక్షేమం అని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం రాక ముందు కలిసి కష్టాలు అనుభవించిన అనేక జాతులు ఎస్టీ జాబితాలోకి చేరితే 1976 తరువాత వడ్డెర, వడియరాజులను బీసీఏ జాబితాలో చేర్చారని, దీనివల్ల వడ్డెర జాతి చాలా నష్టపోయిందన్నారు. ఇప్పటికే వడ్డెరలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలనే ప్రతిపాదనను సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. అది కేంద్రంలోని అంశం కనుక ముందుగా కమిటీ వేసి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరామన్నారు. కేంద్రంలో బీసీ ప్రధాని ఉన్నందువల్ల తప్పకుండా న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. వడ్డెర సంఘం ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్న మురళికి ఒక్కరికి న్యాయం జరిగితే అది జాతి మొత్తానికి జరిగిన సంక్షేమం కాదన్నారు. విద్య ద్వారా మాత్రమే అభివృద్ధి చెందగలం అని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడిలో అయినా పిల్లలను చదివించడంలో నిర్లక్ష్యం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు యనమల మాధవి, ఒంగోలు కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, బీసీ సంఘం రాష్ట్ర నాయకురాలు వేముల బేబిరాణి తదితరులు ప్రసంగించారు. సభ నిర్వహణ కమిటీ నాయకులు బెల్లంకొండ అశోక్, తన్నీరు నాగేశ్వరారవు, తన్నీరు శివప్రసాద్, వల్లెపు మురళి తదితరులు మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, సహకార, కాంట్రాక్టు సొసైటీ పనులలో ఈఎండీ లేకుండా 30 శాతం పనులు రిజర్వేషన్ కల్పించాలని, పనిచేస్తూ ప్రమాదానికి గురైన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కనీసం వచ్చే ఎన్నికల్లో మూడు సీట్లు కేటాయించాలంటూ పలు ప్రతిపాదనలను నాయకుల ముందుకు తీసుకురాగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

# కామూరి సేవాతత్పరత అభినందనీయం

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- రాజన్న నిత్యభోజనశాలను ప్రారంభించిన బాలినేని, ఎంపీ మాగుంట
- హెలికాప్టర్ ద్వారా బాలినేని, మాగుంటపై పూలవర్షం
- బేస్తవారిపేట నుంచి భారీ ర్యాలీ




భారీ గజమాలను బాలినేని, మాగుంటకు వేస్తున్న దృశ్యం

**కొమరోలు:**

మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ నాయకుడు కామూరి రమణారెడ్డి స్వచ్ఛందంగా అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కొనియాడారు. కామూరి రమణారెడ్డి కొమరోలులో నూతనంగా నిర్మించిన కామూరి వారి రాజన్న నిత్య భోజనశాలను బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆదివారం ప్రారంభించారు. బాలినేని, మాగుంట, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కొమరోలుకు వస్తున్న సందర్భంగా హెలికాప్టర్ ద్వారా ఆకాశం నుంచి వారిపై పూలవర్షం కురిపించారు. బేస్తవారిపేట నుంచి భారీ ర్యాలీని ఏర్పాటు చేయగా మండలంలోని తాటిచెర్లమోటు నుంచి వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఓపెన్‌టాప్ వాహనంలో బాలినేని, మాగుంట, జంకెలు వైఎస్ఆర్‌సీపీ నాయకులతో కామూరి వారి రాజన్న నిత్య భోజనశాల వద్దకు భారీ ర్యాలీగా వచ్చారు. 4 రోడ్ల కూడలి వద్ద క్రైన్ల సహాయంతో వారికి భారీ గజమాలను వేసి సన్మానించారు.

**జనసంద్రంగా మారిన కొమరోలు**

బాలినేని, మాగుంట, జంకె వస్తున్న సందర్భంగా కొమరోలు పట్టణం ఉదయం నుంచే జనసంద్రంగా మారింది. కొమరోలులో అడుగడుగునా ప్రజలు పూలతో వైఎస్ఆర్‌సీపీ నాయకులకు నీరాజనం పట్టారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మనోజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు అన్నదాన కార్యక్రమాలు చేస్తూ కామూరి రమణారెడ్డి పేరుతెచ్చుకున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేరుతో రాజన్న భోజనశాలను ఏర్పాటు చేసి పేదప్రజలకు అన్నదానం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, కొమరోలు, బేస్తవారిపేట, అర్ధవీడు ఎంపీపీలు కామూరి అమూల్య, ఓసూరారెడ్డి, వెంకటయ్య, అర్ధవీడు, గిద్దలూరు జెడ్పీటీసీలు చెన్ను విజయ, బుడత మధు, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ పరిశీలకులు బంగారు శీనయ్య, బాలినేని సతీమణి శశిదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



కామూరి వారి రాజన్న నిత్య భోజనశాలను ప్రారంభిస్తున్న బాలినేని, మాగుంట



హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపిస్తున్న దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు జడ్జి రవీంద్రబాబు

### చెన్నకేశవస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

**మార్కాపురం టౌన్:** మార్కాపురంలోని ప్రసిద్ధ చెన్నకేశవస్వామి ఆలయాన్ని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వెంకట రవీంద్రబాబు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ పెనుగొండ కేశవరావులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందించి ఆలయ చరిత్రలను వివరించారు.

### డిగ్రీ రెండో విడత రిజిస్ట్రేషన్ ప్రారంభం

**యర్రగొండపాలెం:** స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులకు రెండో విడత రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు ఆదివారం తెలిపారు. బీఎస్సీ మేథమాటిక్స్, బాటనీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ హిస్టరీ మేజర్ సబ్జెక్టులకు సోమవారం నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 12వ తేదీన కళాశాలల కేటాయింపు ఉంటుందని వివరించారు. దూరప్రాంత విద్యార్థులు స్థానిక బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, డిగ్రీలో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఉన్నత విద్యకు భరోసా

- నేడు జగనన్న విద్యాదీవెన మూడో క్వార్టర్ నిధులు విడుదల
- జిల్లాలో అర్హులైన విద్యార్థులు 47,350 మంది
- జమ కానున్న నిధులమొత్తం రూ.35.39 కోట్లు



**ఒంగోలు:** రాష్ట్రంలో డిగ్రీ నుంచి పీజీ వరకు, ఇంజినీరింగ్, మెడికల్, ఇతర కోర్సులు చదువుతున్న ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈబీసీ/మైనార్టీ విద్యార్థినీ విద్యార్థులకు 2022-23 ఏప్రిల్-జూన్ నిధులు విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన మూడో విడత నిధులు సోమవారం విడుదలకానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గంలో ఈ నిధులు విడుదల చేయనున్నారు. ఈ నిధులు మొత్తం జిల్లాలోని 47,350 మంది విద్యార్థులకు సంబంధించి 42,899 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.35.39 కోట్లు జమకానున్నాయి. స్థానిక ప్రకాశం భవనంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు ఒంగోలు శాసనసభ పరిధిలోని ప్రజాప్రతినిధులంతా పాల్గొంటారని, ఈ సందర్భంగా మెగా చెక్కు పంపిణీ చేస్తారని సాంఘిక సంక్షేమశాఖ నోడల్ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తెలిపారు.

**ఈకేవైసీలో రాష్ట్రంలోనే ప్రకాశం ప్రథమ స్థానం**

జగనన్న విద్యాదీవెన మూడో విడత నిధుల విడుదలకు సంబంధించి ప్రతి విద్యార్థి ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. దీనికి సంబంధించి విద్యార్థి రాష్ట్రంలోని ఏ సచివాలయం నుంచి అయినా ఈకేవైసీ చేయించుకునేలా అవకాశం కల్పించారు. మొత్తం 26 జిల్లాలకు సంబంధించి ఈకేవైసీ నమోదులో ప్రకాశం అగ్రస్థానంలో నిలిచింది. 97.77 శాతం ప్రకాశం ప్రథమస్థానంలో ఉంది.

**సంక్షేమ శాఖల వారీగా**

| సంక్షేమ శాఖ | విద్యార్థుల సంఖ్య | జమకానున్న మొత్తం (రూ.) |
|---|---|---|
| సాంఘీక | 12537 | 9,28,55,434 |
| గిరిజన | 1258 | 88,63,650 |
| బీసీ | 15860 | 10,96,83,060 |
| ఈబీసీ | 11800 | 10,02,91,299 |
| ముస్లిం మైనార్టీ | 3086 | 2,12,36,868 |
| కాపు | 2756 | 2,05,53,497 |
| క్రిస్టియన్ మైనార్టీ | 53 | 5,12,611 |
| మొత్తం | 47,350 | 35,39,96,419 |

**నియోజకవర్గాల వారీగా**

| నియోజకవర్గం | ఎస్సీ విద్యార్థులు | ఎస్టీ విద్యార్థులు | బీసీ విద్యార్థులు | ఈబీసీ విద్యార్థులు | ముస్లిం మైనార్టీ విద్యార్థులు | కాపు విద్యార్థులు | క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు | మొత్తం విద్యార్థులు |
|---|---|---|---|---|---|---|---|---|
| దర్శి | 1477 | 85 | 1787 | 2125 | 180 | 509 | 4 | 6167 |
| గిద్దలూరు | 1185 | 164 | 2737 | 1158 | 766 | 504 | 9 | 6523 |
| కనిగిరి | 1296 | 66 | 2259 | 1714 | 567 | 269 | 2 | 6173 |
| కొండపి | 2428 | 167 | 1869 | 1623 | 210 | 176 | 0 | 6473 |
| మార్కాపురం | 1141 | 67 | 1802 | 1510 | 498 | 248 | 9 | 5275 |
| ఒంగోలు | 1615 | 143 | 2264 | 1224 | 548 | 492 | 15 | 6301 |
| ఎస్ఎన్‌పాడు | 2139 | 127 | 1478 | 1003 | 149 | 283 | 8 | 5187 |
| వై.పాలెం | 1256 | 439 | 1664 | 1443 | 168 | 275 | 6 | 5251 |
| మొత్తం | 12537 | 1258 | 15860 | 11800 | 3086 | 2756 | 53 | 47350 |

# ఎల్‌ఐసీ బోనస్ పేరుతో మోసాలు

● అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ సూచన


ఎస్పీ మలికా గర్గ్ ఫైల్ ఫొటో

ఒంగోలు టౌన్: సైబర్ నేరగాళ్ల మోసాలకు అంతే లేకుండా పోతుంది. ఏ చిన్న అవకాశాన్ని వదిలి పెట్టకుండా మోసాలకు తెగబడుతున్నారు. కళ్లు మూసి తెరిచే లోపలే దోపిడీకి పాల్పడుతున్నారు. ఎల్‌ఐసీ బోనస్ డబ్బుల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీరు ఎల్‌ఐసీ కంపెనీ అందించే అదనపు బోనస్‌కు ఎంపికయ్యారని కొత్త మొబైల్ ఫోన్ నెంబర్ల నుంచి లింకులు పంపిస్తున్నారని, ఒకవేళ పొరపాటున ఎవరైన అలాంటి లింకులను ఓపెన్ చేస్తే చాలు మాయమాటలు చెప్పి జేబులు ఖాళీ చేస్తున్నారని తెలిపారు. లింకు ఓపెన్ చేసిన తరువాత మీకు డబ్బులు పంపించాం, ఒకసారి చెక్ చేసుకోవాలని చెబుతారని, లింకు క్లిక్ చేసి మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా నంబర్లు, పాస్‌వర్డులు, ఇతర సమాచారాన్ని సేకరించడం ద్వారా సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు ఖాతాలో వున్న మొత్తం డబ్బులను కాజేస్తున్నారని వివరించారు. ఆ తరువాత బాధితులు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్విచ్ఛాఫ్ అని వస్తుందని, అంతేకాకుండా మీ వ్యక్తిగత సమాచారంతో ఇతరా నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**ఇలా చేయండి....**

- ఎల్‌ఐసీ బోనస్ డబ్బులు వచ్చాయంటూ వచ్చే లింకులను అసలు ఓపెన్ చేయవద్దు. ఎవరైనా ఫోన్ చేసినా నమ్మవద్దు.
- తెలియని మొబైల్ నంబర్ల నుంచి లింకులను ఎట్టి పరిస్థిలలోనూ ఓపెన్ చేసి సమాచారాన్ని ఇవ్వవద్దు.
- ఎల్‌ఐసీ వాళ్లు మీకు ఎటువంటి లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ పంపించరు అనే వాస్తవాన్ని గ్రహించాలి.
- ఎవరైనా మీకు కాల్ చేసి మీరు ఎల్‌ఐసీ బోనస్ పొందారని, డబ్బులు తీసుకునేందుకు ఫీజులు చెల్లించాలని చెబితే అది మోసం అని గుర్తించండి. ఇలా ఎవరైనా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. సైబర్ హెల్ప్ నెంబర్ 1930కు కాల్ చేయాలి.



# త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

- మెడికల్ కాలేజీ పక్కనే ఉన్న ఎస్ఆర్ క్వార్టర్స్‌కు మంటలు
- తొలగించిన చెట్లను తగలబెట్టడంతో గాలికి వ్యాప్తి చెందిన మంటలు
- వేలాది పీపీఈ కిట్లు, ఐసీయూ మానిటర్‌లు మంటలపాలు
- కొట్టించిన చెట్లను తొలగించడంలో పర్యవేక్షణ కరువు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఆనుకుని ఉన్న ఎస్ఆర్ క్వార్టర్స్‌కు మంటలు అంటుకుని అగ్నిప్రమాదం సంభవించింది. ఈ క్వార్టర్స్‌లో హౌస్ సర్జన్, పీజీ విద్యార్థులు ఉంటున్నారు. అగ్నిప్రమాద విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. అరగంటకు పైగా మంటలు అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బందికి వివరాలను తెలిపేందుకు కూడా అక్కడ కాలేజీ, జీజీహెచ్‌కు సంబంధించిన బాధ్యులు ఎవరూ సంఘటనస్థలానికి రాలేదంటే ఎంతటి నిర్లక్ష్యం ఉందో అర్థమవుతోంది. ఆ ప్రాంతంలో ఉన్న వందల సంఖ్యలో ఉన్న భారీ ప్రమాదకర చెట్లను మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ తొలగించే కార్యక్రమం చేపట్టారు. అయితే నరికివేసిన చెట్లను తొలగించడంలో మాత్రం పర్యవేక్షణ లేకపోవడంతో చెట్లను నరికిన వాళ్లు ఉపయోగపడే మొద్దులను తీసుకువెళ్లి కొమ్మలను అక్కడ పడేసారు. అవి ఎండిపోగా వాటిని తగలపెట్టారు. దీంతో గాలికి మంటలు చెలరేగి భవనం వద్ద ఉన్న వేలాది పీపీ కిట్లపై పడి మంటలు మరింత చెలరేగాయి. ప్లాస్టిక్ కవర్లతో ప్యాకింగ్ చేసిన కిట్లకు మంటలు అంటుకోవడంతో ఆ మంటలు ఎగబాకి భవనంలో లోపలికి సైతం వ్యాపించాయి. గదిలో ఉన్న ఆపరేషన్ థియేటర్ దుస్తులు, ఐసీయూ కంప్యూటర్ మానిటర్‌లు ఇతర వస్తువులు తగలపడ్డాయి. దీంతో పలువురు మెడికల్ విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది గదిలోని వస్తువులను మంటలకు దూరంగా జరిపి మంటలను అదుపుచేసారు. భవనం మొదటి అంతస్తులో ఏసీలు ఉన్నాయి. వాటికి మంటలు వ్యాప్తి చెంది ఉంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి పెను ప్రమాదం సంభవించేదని విద్యార్థులు ఆందోళన చెందారు. కొట్టించిన చెట్లను తీసివేయడంలో పర్యవేక్షణ కొరవడింది. భవనాల మధ్య ఎటుచూసినా ఎండిపోయిన చెట్ల కొమ్మలే దర్శనమిస్తున్నాయి. కాలేజీ, హాస్టళ్లు, క్వార్టర్స్ మధ్య ఎండిపోయిన చెట్ల కొమ్మలే ఉన్నాయని, కొంచెం మంట చెలరేగినా పెద్ద ప్రమాదమే జరుగుతుందని అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు సూచించారు. ఇప్పటికైనా కొట్టివేసిన చెట్లను తొలగించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని విద్యార్థులు, రోగులు కోరుతున్నారు.


మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


గదిలోపల మంటలు ఆర్పిన దృశ్యం

# గోవా మద్యం స్వాధీనం

● 140 ఫుల్ బాటిళ్లు, కార్ సీజ్

కారంచేడు: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తుల ఆటకట్టించారు పోలీసులు. చీరాల ప్రాంతంలో గోవా, ఢిల్లీ, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అక్రమ మద్యం నిత్యం దొరుకుతూనే ఉంటుంది. ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరలకు అమ్మకాలు చేసుకొని డబ్బు గడిస్తున్నారు. దీనిలో భాగంగానే ఆదివారం వేకువజామున అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని కారంచేడు ఎస్సై శ్రీనివాసరావు తన సిబ్బందితో కలసి ఛేజ్ చేసి పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గోవా (వాస్కోడిగామ) నుంచి 140 (750 ఎంఎల్) బ్రాందీ ఫుల్ బాటిల్స్ బ్యాగ్‌లలో సర్దుకొని అక్కడ నుంచి విజయవాడ వరకు ట్రైన్‌లో వచ్చారు. విజయవాడ నుంచి కార్‌లో చీరాలకు ఈ మద్యాన్ని చీరాల రాంనగర్‌కు చెందిన రాగాల ప్రియాంక అనే మహిళ తరలిస్తోంది. కారంచేడు కాలువ సెంటర్‌లో కాపు కాసిన ఎస్సైను గమనించిన కారు వెనక్కు తిరిగి కుంకలమర్రు వైపు దూసుకువెళ్లింది. విషయాన్ని గమనించిన పోలీసులు కారును వెంబడించి పటుకున్నారు. కారులో డ్రైవర్‌తో పాటు ఉన్న ప్రియాంకను కూడా అరెస్టు చేసి, మద్యం, కార్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ కారంచేడు వచ్చి ఎస్‌ఐ శ్రీనివాసరావును, సిబ్బందిని అభినందించారు.


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సీఐ, ఎస్సైలు

# రాజరాజేశ్వరి అమ్మవారికి 4.50 కేజీల వెండి చీర

చీరాల అర్బన్: పట్టణంలోని కుందేరురోడ్డులో వేంచేసియున్న రాజరాజేశ్వరి మందిరంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు సమర్పించిన 4.50 కేజీల వెండి చీరను ఉభయదాతల ఇంటి వద్ద నుంచి మేళతాళాలతో పట్టణంలో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి వెండి చీరను సంప్రోక్షణ చేసి అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమాన్ని మందిర కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

# ఓనం స్పెషల్...ఉలవపాడు పునారస్


వాహనాలలో సర్దుతున్న ట్రేలు


కాయలు ఎగుమతులు చేస్తున్న కూలీలు

- కేరళకు పునారస్ మామిడి ఎగుమతులు
- 29-31 వరకు కేరళలో ఓనమ్ పండుగ
- కేజీ రూ.50 పైనే ఎగుమతులు


మినీ వాహనంలో కేరళకు ఉలవపాడు పునారస్ కాయలు

ఉలవపాడు: ఉలవపాడు పునారస్ మామిడి కాయలు..మామిడి సీజన్ తరువాత వచ్చే పంట. కేవలం పచ్చడి కాయలుగా వీటిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఈ పునారస్ మామిడికి మంచి గిరాకీ ఉంది. దీనికి కారణం కేరళలో జరిగే ఓనమ్ పండుగకు ఈ కాయలను వారు ఎక్కువగా ఇష్టపడతారు. అక్కడ ఈ పండుగకు చేసే సాంప్రదాయ పచ్చడిలో ఈ కాయలను వాడతారు. దీంతో ఈ సమయంలో ఈ మామిడి కాయలు అధికంగా ఎగుమతులు చేస్తారు. గత పది రోజులుగా ఉలవపాడు ప్రాంతంలో పండించిన ఈ కాయలను ఎగుమతులు చేస్తున్నారు. ఈ కాయలు దాదాపు నవంబర్ వరకు దిగుబడి వచ్చినా ఓనమ్ సమయంలో అధికంగా రేటు పలుకుతుంది. ప్రస్తుతం కేరళలో పది రోజుల ఈ పండుగలో ముఖ్యమైన మూడు రోజుల పండుగ ఈ నెల 29, 30, 31 తేదీల్లో జరగనుంది. ఈ పండుగ కారణంగా గత పదిరోజులగా ఉలవపాడు నుండి పునారస్ మామిడి కాయల ఎగుమతులు భారీగా జరుగుతున్నాయి. ఈ పదిరోజుల్లో ప్రతి రోజూ 100 నుంచి 150 టన్నుల వరకు ఈ మామిడి ఎగుమతి జరిగింది. ఈ నెల 28 వరకు ఎగుమతులు చేసి తరువాత మూడు రోజుల పాటు ఎగుమతులు నిలుపుదల చేసినట్లు వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం ఈ పది రోజుల్లో రూ.40 నుంచి ప్రారంభమై రూ.70 వరకు కేజీ పలికింది. సగటున కేజీ రూ.55 రూపాయల చొప్పున కేరళకు ఈ మామిడి కాయలను ఎగుమతులు చేశారు. ఓనమ్ పండుగ అంటే కేరళ ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుతారు. అలాంటి పండుగకు ఉలవపాడు పునారస్ మామిడి కాయలు మాత్రమే అధికంగా ఉపయోగించడం ఈ ప్రాంతానికి గర్వకారణం.

ఉలవపాడు నుంచి లారీలు, మినీ ట్రక్కుల్లో ఈ కాయలను ఎగుమతి చేస్తున్నారు. ప్రతి ఓనమ్ పండుగకు ఉలవపాడు పునారస్ కాయలు స్పెషల్‌గా నిలుస్తున్నాయి.

# ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య


ఏసురత్నం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ: చెట్టుకు ఉరేసుకుని వృద్ధుడు కురిమెట్ల ఏసురత్నం(70) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం మండలంలోని పాకల పంచాయతీ క్రాంతినగర్ సమీపంలోని ఆళ్ల రామలింగారెడ్డి మామిడితోటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఏసురత్నం స్వగ్రామం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామం. ఇతనికి ఇద్దరు భార్యలు, 5 గురు సంతానం. కానీ ఇతను వారివద్ద ఉండకుండా పాకల శివాలయం పూజారి చదలవాడ పార్థసారధి వద్ద గేదెలు మేపుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం పూజారి పార్థసారధి అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. దీంతో ఇతను మనస్థాపం చెంది ఉరేసుకుని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

తర్లుపాడు: కలుజువ్వలపాడులోని జవహర్ నవోదయ విద్యాలయ-2లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఈ నెల 31 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జీఈజీ ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, కంభం, బి.పేట, అర్ధవీడు, వైపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల, దొనకొండ, తర్లుపాడు, కురిచేడు, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కనిగిరి, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల, పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి మండలాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదుచేసుకునేందుకు అర్హులు అని ఆయన తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేయాలని అన్నారు. 2021 - 22 సంవత్సరంలో 3వ తరగతి, 2022 - 23 సంవత్సరంలో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు navodaya.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## దేశంలో రాజకీయాలు మారాలి

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

చీరాల: దేశం మొత్తం మీద రాజకీయాలు మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఆదివారం ఆయన చీరాల మండలం జాండ్రపేటలో స్నేహితుడు పన్నెం సుబ్బారావు భార్య ఇటీవల మరణించగా ఆయనను పరామర్శించేందుకు చీరాల వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మత కలహాలతో అట్టుడికిపోతుంటే ప్రధాని మోదీ అక్కడికి వెళ్లేదన్నారు. గుజరాత్ రాష్ట్రంలో గతేడాది మత కలహాలు చోటుచేసుకున్నాయన్నారు. అది మరచి చంద్రయాన్-3 గురించి మాట్లాడతారన్నారు. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పక తప్పదన్నారు. ఆయన వెంట ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, వ్యవసాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాష్, సీపీఐ నాయకులు మేడా వెంకట్రావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబూరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి సైకం రాజశేఖర్, సుబ్బారావు, చేనేత జనసమాఖ్య నాయకులు మాచర్ల మోహనరావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీకాంత్

మద్దిపాడు: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ ఘటన మద్దిపాడు సమీపంలోని జాతీయరహదారిపై ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గుండ్లాపల్లి గ్రామానికి చెందిన ఉండవల్లి సుబ్బప్రసాద్ తన భార్య శ్రీలక్ష్మితో కలిసి ఒంగోలుకు మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా అద్దంకి నుంచి ఒంగోలు వెళుతున్న ఆర్టీసీ బస్సు మద్దిపాడు సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిలోకి వస్తున్న క్రమంలో మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ప్రమాదంలో శ్రీలక్ష్మి(32)ఘటనా స్థలంలోనే మృతి చెందింది. సుబ్బ ప్రసాద్, కుమార్తెకు తలపై గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సుబ్బ ప్రసాద్ మేదరమెట్ల సచివాలయంలో ఉద్యోగిగా పనిచేస్తుండగా భార్య శ్రీలక్ష్మి అద్దంకిలో బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చంద్రబాబు, లోకేష్‌పై చర్యలు తీసుకోవాలి



మార్కాపురంలో ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు


పొదిలి ఏఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

మార్కాపురం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఆదివారం ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో ఆదివారం మార్కాపురం, పొదిలి, తర్లుపాడు పోలీస్‌స్టేషన్లలో ఆయా మండలాల సోషల్ మీడియా కన్వీనర్లు ఫిర్యాదు చేశారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేక అశాంతిని సృష్టించేందుకు టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి, మంత్రులను, ఎమ్మెల్యేలను దుర్భాషలాడుతున్నారని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ వాసుదేవరెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధులు ఖాశీం, మార్కు, సుభాష్, రామిరెడ్డి, మాధవరెడ్డి, రమేష్, మహేష్, వెంకటేశ్వర్లు, శివారెడ్డి, కొండారెడ్డి, సందీప్, నాలి రజనీ, జావేద్‌బాషా, ఇంద్రసేనారెడ్డి, తారక్‌సాయి, దాసు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని చంద్రబాబు, నారా లోకేష్, అచ్చంనాయుడులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైని కలిసి ఫిర్యాదు చేశారు. పార్టీ మండల కన్వీనర్ డి.శ్రీనివాసరెడ్డి, కోదండరామిరెడ్డి,వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 108లో మహిళ ప్రసవం


మగ బిడ్డతో 108 సిబ్బంది

కొనకనమిట్ల: పురిటి నొప్పులతో బాధ పడుతున్న మహిళను 108లో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవమైంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సలనూతల గ్రామానికి చెందిన పి.ఉదయకి ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు రావటంతో గొట్లగట్టు ప్రాథమిక వైద్యశాలకు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స అనంతరం కాన్పు కోసం మార్కాపురం జిల్లా వైద్యశాలకు రిఫర్ చేశారు. 108 వాహనంలో తీసుకెళుతుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ కావటంతో వాహనాన్ని ఆపి మహిళకు ప్రసవం చేశారు. ఉదయ మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 ఈఎంటీ కాశీంవలి, పైలట్ ఖాదర్‌బాషలు తెలిపారు.